క్లుప్తంగా

నేడు నూతన పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ

భట్టిప్రోలు: భట్టిప్రోలు వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నూతన పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు శుక్రవారం తెలిపారు. ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు దీనిని గమనించాలని పేర్కొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రేపల్లెరూరల్: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందని ఎంపీడీవో శివపార్వతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పెనుమాల సుశీల అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



రేపల్లె రూరల్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలోకి చెందిన క్రీడాజట్లు పాల్గొని ప్రతిభను కనపరిచారు. ఈ సందర్భంగా పేటేరు, ఉప్పూడి, కారుమూరు, వడ్డీవారిపాలెం, బేతపూడి, చోడాయపాలెం, తదిర సచివాలయాల పరిధిలోని జట్లు పోటీలలో హోరాహోరీగా తలపడ్డాయి. క్రీడాప్రాంగణంలో క్రీడాకారులకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు ప్రథమ చికిత్సా కేంద్రాన్ని సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు.

7న కంటి, కిడ్నీ వ్యాధులకు ఉచిత వైద్యశిబిరం

చెరుకుపల్లి: గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత కంటి, కిడ్నీ వ్యాధుల వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కనగాల హాజీ మహమ్మద్ ఖాసీమ్ సాహెబ్ మమమ్మద్ గాలాబ్ సాహెబ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ అబ్దుల్ సమ్మద్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కనగాల బీఈడీ కళాశాల ఆవరణలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఒంటి గంట వరకు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కంటి మరియు కిడ్నీ భాదితుల కొరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందని చెప్పారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరానికి వచ్చే రోగులు రేషన్ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డు లేదా ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ వెంట తీసుకురావాలని తెలిపారు.

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి



భట్టిప్రోలు: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి పట్ల పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం. హనుమంతరావు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 2 నుంచి నాలుగు నెలల వయసు దాటిన ప్రతి దూడ, పశువులకు ఈ టీకాలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా టీకా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకిన పశువుల్లో పాల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయని తెలిపారు. రైతులు అపోహలు విడనాడి తప్పని సరిగా టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో రేపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ రవీంద్రబాబు, ఏడీడీఎల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీలక్ష్మి, పశు వైద్యాధికారిణి బి.లక్ష్మి రంజిత, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక వికాసం

పిట్టలవానిపాలెం: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక సౌష్టవాన్ని పెంపొందిస్తాయని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని ఖాజీపాలెం మంతెన సుబ్బరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రికెట్ పోటీలు జరిగాయి.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, సచివాలయ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయని తెలిపారు. భవనంవారిపాలెం గ్రామ సచివాలయ పరిధిలోని క్రీడాకారుల చేత క్రికెట్ క్రీడను నిర్వహించారు. గ్రామ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన క్రీడాకారులను మండల స్థాయి క్రీడలకు ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు కరిముల్లా, ఉపాధ్యాయులు ఉన్నారు.

పార్టీ అభ్యున్నతికి కలసికట్టుగా కృషిచేద్దాం



పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న వరికూటి

వైఎస్సార్‌సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి

భట్టిప్రోలు: భట్టిప్రోలులో వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కలసికట్టుగా పని చేసి పార్టీ విజయానికి బాటలు వేయాలని వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు ఆకాంక్షించారు. స్థానిక విఠలేశ్వరస్వామి దేవాలయంలో శుక్రవారం పార్టీ సర్వసభ్య సమావేశం పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధి కోసం విభేదాలను పక్కన పెట్టి అంతా ఏకతాటిపై నడవాలని కోరారు. ఏ పార్టీలోనైనా ఒడిదుడుకులు ఉండటం సహజమని...వర్గ విభేదాలకు తావివ్వకుండా రాబోయే ఎన్నికల్లో అంతా కలసి పని చేయాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో వ్యవస్థ బాగుంటేనే పార్టీ పటిష్ఠంగా ఉంటుందని ఆ దిశగా అడుగులు వేద్దామని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి ఒక్కరికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. తొలుత స్థానిక దేవాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం విఠలేశ్వరనగర్ కాలనీ రహదారి దుస్థితిని పరిశీలించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, వైస్ సర్పంచ్ బూర్లె రామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ పడమట శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల నేతలు మద్దుల గిరిధర్, పెరికల శ్యామ్, అబ్దుల్ కరీమ్, వేల్పూరి బాలసుబ్రహ్మణ్యం (చిన్నారి), సయ్యద్ నబి, మద్దుల రాముడు, సయ్యద్ నజీర్, దారా చెన్నయ్య, తిరువీధుల బాలాజి,మేడూరి వీరయ్య, దాసరి గోపాలరావు, వేల్పూరి నాగేశ్వరరావు, శిరందాసు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్థితిమంతులుగా ఎదగాలి

కర్లపాలెం: మహిళలు లక్షాధికారులుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ సీహెచ్ కృష్ణ అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో శుక్రవారం లక్షాధికారి మహిళ కార్యక్రమంపై జరిగిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవటంతో పాటు రుణాలను సైతం వినియోగించుకోవాలని సూచించారు. సంవత్సరానికి నికర ఆదాయం లక్షకు తక్కువగా ఉన్న మహిళలను గుర్తించి వైఎస్సార్ క్రాంతిపథం ద్వారా వారిని దత్తత తీసుకుని వారి జీవనోపాధి మెరుగుదలకు తగిన శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఏపీఎం శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడితో పాటు బ్యాంకు రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా మహిళలు అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనలక్ష్మి, జిల్లా సోషల్ సెక్యూరిటీ రాజారాం, స్త్రీనిధి ఏజీఎం నాగబాబు, మేనేజర్ కామేశ్వరి, సీసీలు లక్ష్మీ సోమేశ్వరి, శివకోటేశ్వరరావు, పూర్ణ చంద్రరావు, వివోఏలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న హనుమంతరావు

భట్టిప్రోలు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల వేగం పెంచాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు కోరారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహ నిర్మాణాలకు సంబంధించిన నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లబ్ధిదారులకు త్వరితగతిన రుణాలు ఇప్పించాలని ఏపీఎం శ్రీమన్నారాయణను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, ఈవోపీఆర్డీ టి.ఊహారాణి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు శేతు రామచంద్రరరావు, ఎస్. శివకృష్ణ, రావూరి సౌమ్య, పంచాయతీ కార్యదర్శులు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



ఎంపికైన క్రీడాకారులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

పిట్టలవానిపాలెం: మండలంలోని ఖాజీపాలెం కేవీఆర్, కేవీఆర్ అండ్ ఎంకేఆర్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శివప్రసాద్ తెలిపారు. వీరు సేలం యూనివర్శిటీ నందు దక్షిణ భారత హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా శుక్రవారం క్రీడాకారులను ఖాజీపాలెం కళాశాలలో అభినందించారు.ఈ నెల 4, 5 తేదీలలో తెనాలి ఏఎస్ఎన్ స్టేడియంలో జరిగిన పోటీలలో కళాశాలకు చెందిన బి.దివ్యవాణి, బి.శిరీష పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరచి దక్షణ భారత హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. గత మూడేళ్ళుగా కళాశాలకు చెందిన క్రీడాకారులు సౌత్ జోన్ అంతర్ యూనివర్శిటీ పోటీలకు ఎంపికవుతున్నట్లు చెప్పారు.ఎంపికై న క్రీడాకారులను కళాశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీనివాస కుమార్, వెంకట శివరామరాజు, జాయింట్ సెక్రెటరీ ఎం.కృష్ణంరాజు, పీడీ రామకృష్ణారెడ్డి తదితరులు అభినందించారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత

గణపవరం(కర్లపాలెం): ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుందని గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ కె.మోజెస్ అన్నారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 45మంది విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం శ్రీనివాసరావుతో కలసి ఆయన ట్యాబ్‌లు అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం యూనీఫాం, పుస్తకాలు, బ్యాగ్‌లతో పాటు విద్యార్థులు కూర్చునేందుకు సౌకర్యవంతమైన బెంచీలు ఏర్పాటు చేసిందని వివరించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలను రూ.63 లక్షలతో ఆధునీకరించి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.కొండలు, భాస్కర్, ఆదినారాయణ, ఏడుకొండలు, కోటేశ్వరమ్మ, బాపూజీరెడ్డి, విజయభాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ విప్లవం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



ఏపీకి జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ విప్లవాన్ని తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని 16వ వార్డు ముత్తెంశెట్టిపాలెంలోని సచివాలయం వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి తమ ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు లబ్ధి చేకూర్చడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసినట్లు వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలందరూ ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. మాజీ కౌన్సిలర్ కాళిదాసు విజయ మాట్లాడుతూ తమ వార్డులో ఇప్పటి వరకు రూ.22.49కోట్ల సంక్షేమాన్ని అందించినట్లు తెలిపారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన లబ్ధిదారుల వివరాలు తెలియజేసే బోర్డులను, ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు అవసరం బుక్‌లెట్‌లను ఆవిష్కరించారు. అలాగే పార్టీ జెండాను ఆవిష్కరించారు. సమావేశంలో మున్సిపల్ మేనేజర్ అప్పలరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళిదాసు వెంకటసత్యం, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సేకరణలో ఇబ్బందులు లేకుండా చూడండి

మున్సిపల్ ఆర్‌డీ శ్రీనివాసరావు



రైతుబజార్‌లో పర్యటిస్తున్న ఆర్‌డీ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ గుంటూరు రీజనల్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలోని కొత్తపేట, వహబ్‌చౌక్, చెంచుపేట, బుర్రిపాలెం రోడ్డులోని రైతుబజార్‌లను శుక్రవారం ఆయన పరిశీలించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులు కూడా ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వలే డోర్ టు డోర్ కలెక్షన్‌ను ఆటోల ద్వారా చేయాలని అందుకు అవసరమైన రోజు వారి కూలీలను నియమించుకోవాలన్నారు. ఆయన వెంట కమిషనర్ ఎం.జశ్వంతరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎ.రామచంద్రరావు, డి.శ్రీనివాసరావులు ఉన్నారు.

ఆరోగ్య సురక్షతో పేదలకు మెరుగైన వైద్యం



నిజాంపట్నం: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందనుందని ఎంపీడీవో నాగలక్ష్మి తెలిపారు. మండలంలోని అడవుల దీవి జెడ్పీహైస్కూల్లో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యసేవలు అందాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా ప్రతి ఒక్కరికి ఉచితంగా మంచి వైద్యాన్ని అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శొంఠి శ్రీనివాసరావు, కూచినపూడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ నాగార్జున, డాక్టర్ గోపీనాథ్, డాక్టర్ అరుణ, డాక్టర్ ఇంతియాజ్, సూపర్‌వైజర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

పిట్టలవానిపాలెం: సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు 2024 జనవరి నుంచి ప్రతినెలా రూ.3వేల పింఛన్‌ను అందించడం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లీలా శ్రీనివాసరెడ్డి, బాపట్ల జిల్లా మహిళా అధ్యక్షురాలు యేట్ర అశ్వినిరెడ్డి అన్నారు. మండలంలోని పిట్టువారిపాలెం గ్రామ సచివాలయంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌లు పెంచడం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల శాసన సభ్యునిగా కోన రఘుపతిని, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి వెంకటరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల పంపిణీ

తెనాలిఅర్బన్: దాసాకూటి ఆశ్రమం వారి ఆధ్వర్యంలో అంగలకుదురు గ్రామంలో అయోధ్యలోని శ్రీరాముని అక్షింతలను శుక్రవారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలు, శ్రీరాముని జెండాలను గ్రామంలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కఠారి వాసుదేవనాయుడు, కడియాల నందకిషోర్, కనగాల హరి, భారతి, అల్లూరి పద్మ, శైలజ, మాలతి, ప్రశాంతి, జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

తెనాలిరూరల్: పెళ్లి చేసేందుకు తల్లిదండ్రులు సంబంధాలు చూస్తుండడంతో ఇష్టంలేని యువతి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ సుల్తానాబాద్‌కు చెందిన కుంచాల స్వాతి(24) ఎంఫార్మసీ చదివింది. కుమార్తెకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం ఇష్టం లేని ఆమె గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శుక్రవారం సమాచారం అందుకున్న త్రీటౌన్ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యాజ్యోతి పుస్తకాల పంపిణీ



అమర్తలూరు(వేమూరు): విద్యాజ్యోతి పుస్తకం చదవడం ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించడం జరుగుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావు తెలిపారు. అమర్తలూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు విద్యాజ్యోతి పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పదో తరగతి విద్యార్థులకు మంచి మార్కులు సాధించేందుకు విద్యా జ్యోతి పుస్తకాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. పదో తరగతి విద్యార్థులంతా విద్యా జ్యోతి పుస్తకాలు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాపర్ల నరేంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పింఛను పెంపుతో పేదల ఇళ్లల్లో సంబరాలు



పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోన, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: పింఛనుదారుల ఇళ్లల్లో పండుగ వాతావరణం తీసుకొచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వారు ఎప్పటికి మరిచిపోరని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. ప్రతి పింఛనుదారుడి మోములో చిరునవ్వులు తీసుకొచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా చూసుకునేందుకు ప్రజలు తహతహలాడుతున్నారని అన్నారు. పింఛను రూ.3వేలకు పెంపు చేయటాన్ని పురస్కరించుకుని వ్యవసాయ కళాశాలలో శుక్రవారం సభ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రతి పింఛనుదారులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎటువంటి సిఫార్సులు అవసరం లేకుండా కేవలం అర్హతనే ప్రామాణికంగా చేసుకుని ప్రభుత్వం పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో చొప్పర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ ఏ.భానుప్రతాప్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు, నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, జోగి రాజా, చల్లా రామయ్య, రంగారావు, షేక్.సయ్యద్ పీర్ తదితరులు ఉన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు



నగర సంకీర్తన సంఘం నిర్వాహకులకు హారతి ఇస్తున్న భక్తులు

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలంలోని ఐలవరం వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాస ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. ఆలయ ప్రధాన అర్చకులు దీవి రఘునాథ చక్రవర్తి ఆధ్వర్యంలో తిరుప్పావై, గోదాదేవి రంగనాయకస్వామి పూజలు జరుగుతున్నాయి. ఎస్ఎస్ఎఫ్ నగర సంకీర్తన సంఘం ఆధ్వర్యంలో మేలుకొలుపు, సంకీర్తనలు కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా భక్తులు నగర సంకీర్తన బృందానికి హారతులు ఇస్తున్నారు. అర్చకులు చక్రవర్తి మాట్లాడుతూ ఈ నెల రోజులు విష్ణుమూర్తికి ప్రీతికరమైన రోజులని ఈ పర్వదినాల్లో స్వామిని పూజించడం ద్వారా సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, నగర సంకీర్తన సంఘం నిర్వాహకులు కేబీవీ రమణ, కెఎస్ ప్రసాద్, జి. జగన్‌మోహన్‌రావు, ఎ. వెంకట్రావు, డి. వెంకటేశ్వరరావు, డి. సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చలో పార్లమెంట్ పోస్టర్ల ఆవిష్కరణ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రేపల్లె రూరల్: కేంద్ర ప్రభుత్వం విద్యారంగంలో అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 12వ తేదీన ఛలోపార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో ఛలో పార్లమెంట్ పోస్టర్‌లను శుక్రవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోకి రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని హామీనిచ్చిందన్నారు. ఈ విధానాలు పేదలకు ప్రభుత్వ విద్యను దూరం చేసే విధంగా ఉందన్నారు. దీనిని దేశవ్యాప్తంగా ప్రజలు, ప్రజాసంఘాలు వ్యతిరేకించాలని కోరారు. ఉన్నత విద్యలో అనేక రకాలైన మార్పులు తీసుకువచ్చి సెంట్రల్ యూనివర్సిటీలలో ఆర్ఎస్ఎస్ సంస్థల్లో పని చేస్తున్న వ్యక్తులను వీసీలు గా, ప్రొఫెసర్లుగా నియమిస్తూ సెంట్రల్ యూనివర్సిటీలను ఆర్ఎస్ఎస్ సంస్థలకు అడ్డాగా, మత సంస్థలుగా మార్చేస్తున్నారన్నారు. విదేశీ యూనివర్సిటీలను దేశంలోకి ఆహ్వానిస్తూ చేసిన చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఛలో పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు శివశంకర్, పట్టణ కార్యదర్శి సూర్య ప్రకాష్, నాయకులు హేమ నాగశ్రీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పింఛను పెంపుతో అవ్వాతాతలకు ఆర్థిక భరోసా

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి



పింఛను లబ్ధిదారులతో మాట్లాడుతున్న వరికూటి

చుండూరు(వేమూరు): అవ్వా తాతలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పింఛన్ భరోసా కల్పించారని నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. చుండూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు పెంపు ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కళాకారులకు పింఛన్ భరోసా కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. ప్రభుత్వం పింఛన్లు పెంపు చేయడంతో ప్రతి గ్రామంలో పింఛన్ల పండుగ జరుగుతుందని ఆయన చెప్పారు. ప్రజలకు ఇచ్చిన హామీలను మాట తప్పకుండా అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని అన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ప్రజలకు వాగ్దానాలు చేయడం తప్ప అమలు చేసిన తీరు ఎక్కడా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాలాది రూబేను, గ్రామ సర్పంచ్ వుయ్యూరి అప్పి రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అన్నప రాఘురామ రెడ్డి, అళ్ల వెంకట రమణ రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు విజయ్ భాస్కర్, పందిపాటి ఏసు, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, జొన్న కూటి ఉమాదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో హెచ్‌ఎం వెంకటరాజు, పీఈటీ గోపి

చింతాయపాలెం(కర్లపాలెం): తమ పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపికయ్యారని చింతాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం టి.వెంకటరాజు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో సైక్లింగ్ క్రీడాకారులకు అభినందన సభ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి మాట్లాడుతూ డిసెంబర్ 29 నుంచి 31 వరకు ప్రకాశం జిల్లా కనిగిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో సైక్లింగ్ జూనియర్స్ బాలికల విభాగంలో పి.అనూరాధారెడ్డి, ఎస్‌కె జాస్మిన్, జూనియర్స్ బాలుర విభాగంలో కె.భవానీ శంకర్‌రెడ్డి, సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో పి.అయ్యప్పరెడ్డి మెరుగైన ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలలో పాల్గొనేందుకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 8 నుంచి 12 వరకు కర్ణాటకలో జరగనున్న సైక్లింగ్ ఫెడరేషన్ ఇండియా జాతీయస్థాయి పోటీలలో తమ పాఠశాల క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. సైక్లింగ్ క్రీడాకారులను ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు అభినందించారు.